క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

కొడంగల్: పట్టణంలోని మహాదేవుని ఆలయం వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మధుకర సేవా సమితి సభ్యులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 3 వరకు శిబిరం కొనసాగుతుందని చెప్పారు. ప్రజాసేవే లక్ష్యంగా ఐదేళ్లుగా రక్తదానం, దంత వైద్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. ప్రస్తుత వైద్య శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నామని, కావున ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వండి

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడానికి కీలకంగా వ్యవహరించిన బంజార ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని గిరిజన సంఘాల నాయకులు విఠల్ నాయక్, రాహుల్ నాయక్, గోపాల్ నాయక్‌లు కోరారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిన బంజార నాయకులకు పార్టీ పదవుల్లో, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలన్నారు. రిజర్వేషన్లు ఉన్న ప్రాంతంలోనే కాకుండా అన్ని ప్రాంతాల్లోనూ తమను గుర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాంగ్యానాయక్, రవి, శంకర్, వినోద్, బాబ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రాలు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: మండల పరిధి రుద్రారం గ్రామానికి చెందిన రవిగౌడ్ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. రవిగౌడ్ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్నాడు. చికిత్సకు పెద్ద మొత్తంలో డబ్బు అవసరం కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షలకు ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఈ మేరకు బాధితుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం హైదరాబాద్‌లో తిరుపతిరెడ్డి ఎల్‌ఓసీ పత్రాలు అందజేశారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

దోమ: వికలాంగుల అభ్యున్నతికి కృషి చేస్తానని భారత వికలాంగుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు చుక్కయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధి దాదాపూర్ గ్రామంలో భారత పరిరక్షణ సమితి నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా మొగులయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా దస్తయ్య, కార్యదర్శిగా వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా రాములు, మీడియా కన్వీనర్‌గా దుద్యాల వెంకటయ్య, కోశాధికారిగా గుడిసె శిరీష, పలువురు సభ్యులను నియమించారు. అనంతరం నూతన అధ్యక్షుడు మొగులయ్యకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కిష్టప్ప, మహిపాల్, బీమయ్య, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

'రంజిత్‌రెడ్డిని గెలిపించాలి'

దోమ: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. సంక్షేమ పథకాల పేరిట పేదలను మభ్యపెట్టి, పార్టీ నేతల సంక్షేమానికే పెద్దపీట వేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆరు గ్యారంటీ పథకాలను అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటుందని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆయన కోరారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



కొత్తపల్లిలో ఇఫ్తార్‌లో పాల్గొన్న నేతలు

మొయినాబాద్: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్ అన్నారు. శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో మహ్మద్ ఆసిఫ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ పవిత్ర మాసమన్నారు. రంజాన్‌లో ఉపవాస దీక్ష చేయడం ఆరోగ్యంతోపాటు, శాస్త్రీయంగా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఎజాజ్, పెంటయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

తాండూరు రూరల్: ఎల్మకన్నె సహకార సంఘం సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు సీఈఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని శివాజీచౌక్ సమీపంలోని సొసైటీ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమీక్షకు చైర్మన్ రవిగౌడ్‌తో పాటు డైరెక్టర్లు, రైతులు హాజరు కానున్నారని వెల్లడించారు.

మసకబారిన దర్జా

దశాబ్దాలుగా సేవలందించిన నిజాం నాటి భవనం

- ప్రస్తుతం వానరాలు, విషసర్పాలకు ఆవాసంగా మారిన వైనం
- పాలకుల నిర్లక్ష్యానికి బోసి పోతున్న భవంతి



నిజాం కాలం నాటి పురాతన భవనం

నిజాం కాలం నాటి భవన సముదాయం నేడు నిరుపయోగంగా మారింది. గతంలో పోలీస్ స్టేషన్, రెవెన్యూ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు కొలువుదీరి, ప్రజలకు సేవలందించిన ఈ బంగ్లా నేడు నిరాదరణకు గురైంది. రాజసం కోల్పోయి.. శిథిలావస్థకు చేరింది.

ధారూరు: నిజాం పాలనలో రెవెన్యూ సెక్టార్‌గా విరాజిల్లుతుండేది. మూడు జిల్లాల నుంచి వచ్చే వారి నుంచి ఇక్కడి నుంచే రెవెన్యూ వసూలు చేసేవారు. స్వాతంత్ర్యం అనంతరం ఈ భవనం దశాబ్దాల తరబడి వివిధ ప్రభుత్వ కార్యాలయాలు అందులో నెలకొల్పి, అక్కడి నుంచే ప్రజలకు సేవలందించారు. మండల వ్యవస్థ ఏర్పాటు అయ్యాక మండల పరిషత్ కార్యాలయంగా, ఆ తరువాత కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంగా సేవలందించింది. క్రమంగా అన్ని కార్యాలయాలను తొలగించగా.. అది వృథాగా మారింది. నేటికీ గోడలు చెక్కు చెదరక పోయినా.. దంగు సున్నంతో వేసిన స్లాబ్ నుంచి కొద్దిగా నీరు కారుతుంటుంది.

విషసర్పాలకు ఆవాసం..

ప్రస్తుతం ఈ భవనం కోతులకు, విషసర్పాలకు ఆవాసంగా మారింది. కనీస మరమ్మతులు చేపడితే.. ఏదేని ప్రభుత్వ కార్యాలయం లేదా వ్యవసాయ కార్యాలయానికి వినియోగించుకునే అవకాశం ఉంది. పాడుబడిన బంగ్లా ఉండటంతో.. అందులో సంచరిస్తున్న సర్పాలు, కోతులు తదితర కీటకాలు పక్కనే ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలోకి చొరబడి విద్యార్థినులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మండల పరిషత్‌లో పనిచేసే ఓ అటెండర్ పలుమార్లు పాఠశాలలోకి చొరబడిన పాములను బంధించి, సమీప అడవిలో వదిలి పెడుతున్న సంఘటనలు అనేకం. ఇప్పటి వరకు పాఠశాలలోకి వచ్చిన సర్పాలు ఎవరికీ ఎటువంటి హానీ చేయనప్పటికీ.. మునుముందు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను విద్యార్థినులు కోరుతున్నారు. కాగా.. పాతకాలం నాటి భవనం చుట్టూ ప్రహరి నిర్మించి వదిలివేశారు. దంగు సున్నంతో నిర్మించిన నాటి బంగ్లా.. నేటికీ చెక్కు చెదరకుండా ఉడటంతో.. ఇంజినీరింగ్ అధికారులు సైతం ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు.

వినియోగంలోకి తేవాలి



నిజాం కాలం నాటి భవనమే అయినా.. ఇప్పటికీ పటిష్టంగా ఉంది. కొద్దిగా నిధులు వెచ్చించి, మరమ్మతు చేయిస్తే.. వినియోగంలోకి వస్తుంది. ప్రస్తుతం మండల వ్యవసాయ కార్యాలయానికి సొంత భవనం లేదు. రైతు వేదికలోని ఓ గదిలో దానిని కొనసాగిస్తున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న రైతు వేదిక వలన ఉపయోగం శూన్యం. నాడు దంగు సున్నాన్ని మెత్తగా రుబ్బి స్లాబ్ వేశారు. భవనం దెబ్బతినకుండా నేటికీ ఉందంటే నాణ్యతతో ఉన్నట్లే. అధికారులు తగిన చర్యలు తీసుకుని, భవనాన్ని వినియోగంలోకి తేవాలి.

–మహ్మద్ బాబాఖాన్, ధారూరు

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శంకర్



చేవెళ్లలో మాట్లాడుతున్న శంకర్

చేవెళ్ల: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని అంబేడ్కర్ భవన్‌లో చేవెళ్ల జోన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థుల సమస్య పట్టించుకోకపోతే వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు ప్రారంభిస్తున్న విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జోన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీను, కార్యదర్శిగా అరుణ్, ఉపాధ్యక్షుడిగా ఎస్.సాయి, యశ్వంత్, సాయి అక్షిత్, సహాయ కార్యదర్శులుగా చందు, శివ, విఘ్నేష్ తదితరులు నియమించారు.

'అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం'



అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

షాద్‌నగర్ రూరల్: అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు అన్నారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండల పరిధి చిల్కమర్రి గ్రామంలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాటలు, ఉపన్యాసాలు, నాటకాల ద్వారా విద్య ప్రాముఖ్యతను వివరించారు. గ్రామస్తులకు వారివారి పేర్లు రాయడం వంటివి నేర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ విద్య ఎంతో అవసరమన్నారు. నిరక్షరాస్యతను నిర్మూలించి, అక్షరాస్యతను పెంపొందించేకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతి వ్యక్తి చదువుకుంటేనే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని స్పష్టం చేశారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నర్సింలు

షాద్‌నగర్: స్వర్గీయ నందమూరి తారకరామారావు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు పిలుపునిచ్చారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఏ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయలేదని ఆరోపించారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాతనే బడుగులకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. అదే విధంగా తెలుగువారి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత ఆయనకే దక్కుతుందని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ క్రమశిక్షణకు మారుపేరని.. పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు చేయడంతో పాటు, మండల వ్యవస్థను ఏర్పాటు చేసిన మహనీయుడని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, గందం ఆనంద్, కందూరి అంజయ్య, మేడిగ శ్రీను, రమేశ్, ఈశ్వర్‌రావు, రాములుగౌడ్, భాస్కర్‌రెడ్డి, భూపతిరెడ్డి, శంకరయ్య, దాసరి అనంతయ్య, యాదయ్య, బక్కని చిన్న నర్సింలు, యాదయ్య, నర్సింలు, సాయి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



లీకేజీతో వృథాగా పోతున్న నీరు

కొందుర్గు: రామచంద్రాపూర్ నుంచి కొందుర్గు వెళ్లే దారిలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతుంది. అయినా పట్టించుకునే వారు కరువయ్యారు. మిషన్ భగీరథ నీరు స్వచ్ఛమైనదని, ఈ నీటిలో సరిపడా మినరల్స్ ఉంటాయని, నీటిని శుద్ధి చేసే సమయంలో ఎలాంటి రసాయనాలు వినియోగించరని, వీటిని తాగితే ఆరోగ్యంగా ఉంటారని అధికారులు చెబుతుంటారు. కానీ ఈ నీటిని సరఫరా చేసే పైపులైన్ ఎక్కడో ఓ చోట ఎప్పుడూ లీకేజీ అవుతూనే ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. భగీరథ లీకేజీతో తాగు నీరు కలుషితమతుందని ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి, పైపులైన్ లీకేజీలను అరికట్టాలని కోరుతున్నారు.

వీధి కుక్కల పట్టివేత



కుక్కలను పట్టుకుంటున్న పంచాయతీ సిబ్బంది

నందిగామ: రంగారెడ్డి జిల్లా నందిగామలో గ్రామ పంచాయతీ సిబ్బంది శుక్రవారం వీధి కుక్కలను పట్టుకున్నారు. గ్రామంలో కొంత కాలంగా కుక్కలు పలువురిని గాయపర్చాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. పలువురి ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, ప్రత్యేక బృందాల సహాయంతో సుమారు 300 కుక్కలను బంధించి, అటవీ ప్రాంతంలో వదిలినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

పల్లెకు వెళ్లని 'పల్లె వెలుగు'

రవాణ కష్టాలను ఎదుర్కొంటున్న ప్రజలు

- అసౌకర్యానికి గురవుతున్న విద్యార్థులు
- గత్యంతరం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న గ్రామస్తులు
- ఉచిత ప్రయాణానికి నోచుకోని ఆడబిడ్డలు



కొడంగల్ బస్టాండ్

కొడంగల్: పల్లె ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) వెనుకంజ వేస్తోంది. పల్లె వెలుగు బస్సులు గ్రామాలకు సరిగా రావడం లేదని, తద్వారా రవాణా కష్టాలు ఎదుర్కొంటున్నామని గ్రామీణ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. విధిలేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నామని వాపోతున్నారు. ఇక విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని, చదువుకోసం మండల కేంద్రం, తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఆర్థిక భారంతో సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. కొడంగల్ నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ వెనుకబడిన ప్రాంతం. ఇక్కడి ప్రజలు కర్నాటక, తాండూరు, పరిగి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట డిపో బస్సులపై ఆధారపడి ప్రయాణిస్తున్నారు. ఎ

వస్తే ఒకేసారి.. లేదంటే అంతేమరి

క్కడికి వెళ్లాలన్నా సకాలంలో బస్సులు తిరగవు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వస్తే ఒకేసారి నాలుగైదు బస్సులు వస్తాయి. రాకపోతే గంటల తరపడి రావు. ఇది నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్ బస్టాండ్ పరిస్థితి. కాగా.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. కానీ.. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించడు అన్న చందంగా.. సంస్థ పల్లెలకు సర్వీసులను తిప్పకపోవడంతో.. సర్కారు పథకం గ్రామీణ ప్రాంత ఆడబిడ్డలకు అందటం లేదన్న విమర్శలు ఉన్నాయి.

విద్యార్థులకు తప్పని తిప్పలు

మండల పరిధి రుద్రారం, అంగడిరాయిచూర్, టేకుల్‌కోడ్, అన్నారం, నాగారం, పాటిమీదిపల్లి, లక్ష్మీపల్లి, సంగాయిపల్లి, చిట్లపల్లి గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. గతంలో పరిగి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిత్యం తిరిగేది. ప్రస్తుతం స్కూల్ పిల్లల కోసం ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం ఒక్క ట్రిప్పు మాత్రమే సర్వీసు తిరుగుతోంది. పాఠశాలలకు సెలవులు ఉంటే, ఆ ఒక్క పూట కూడా బస్సు రాదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'కొడంగల్‌కు రాకపోకలు కొనసాగించాలంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. పరిగి డిపో బస్సుకు గతంలో మంచి ఆదాయం వచ్చేది. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సంస్థకు నష్టం చేకూరటంతో పాటు.. ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు' అని పల్లె ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

జిల్లా కేంద్రానికి బస్సు కరువు



వికారాబాద్‌కు బస్సు ప్రారంభిస్తున్న నాటి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి (ఫైల్)

కొడంగల్ నుంచి వికారాబాద్ జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం లేదు. జులై 01, 2017లో నాటి రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి కొడంగల్ నుంచి జిల్లా కేంద్రానికి పల్లె వెలుగు బస్సును ప్రారంభించారు. వారం రోజులు తిరగక ముందే సర్వీసును సంస్థ అధికారులు రద్దు చేశారు. ప్రాంత ప్రజలు పలు మార్లు ఫిర్యాదు చేసినా, ఆర్టీసీ స్పందించ లేదు. వికారాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే రెండు బస్సులు ఎక్కి దిగాలి. పరిగి నుంచి వెళితే 52 కిలో మీటర్లు, తాండూరు నుంచి 63 కిలో మీటర్ల దూరం అవుతోంది. సాక్షాత్తు నాటి మంత్రి పట్నం.. ప్రారంభించిన బస్సునే అధికారులు రద్దు చేయడం పట్ల అనేక విమర్శలు వచ్చాయి. వస్తూనే ఉన్నాయి.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు



చలివేంద్రాన్ని ప్రారంభించిన భీమ్ భరత్

- కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్ భరత్

మొయినాబాద్ రూరల్: బాటసారుల దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్ అన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్ చౌరస్తాలో కట్టమీది ప్రకాశ్, శ్రీనివాస్ సోదరులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడారు. వేసవిలో బాటసారులు, ప్రయాణికుల దాహం తీర్చేందుకు చల్లటి నీరు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చలివేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా దాతలు ముందుకొచ్చి ఏర్పాటు చేయాలని కోరారు. వేసవి తీవ్రత పెరిగిందని, ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండే ఎండలో బయటికు వెళ్లరాదన్నారు. మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, భద్రప్ప, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

బూచన్‌పల్లిలో వీధి నాటకం



విష్ణుమూర్తి, భూదేవి వేషధారణలో కళాకారులు

మర్పల్లి: మండల పరిధి బూచన్‌పల్లిలో గురువారం రాత్రి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర ఆధారంగా కళాకారులు వీధి నాటకాన్ని ప్రదర్శించారు. నాటకం నాలుగు రోజుల పాటు.. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జాము 5 గంటల వరకు కొనసాగనుంది. బ్రహ్మంగారి జీవిత చరిత్రలోని పాత్రల్లో కళాకారులు లీనమై.. కథను వివరిస్తారని నిర్వాహకులు తెలిపారు. రెండో రోజైన శనివారం నాటక ప్రదర్శన ఉంటుందని, ఈ కార్యక్రమం వచ్చే నెల 4వ తేదీ వరకు కొనసాగనుందని వెల్లడించారు.

చేవెళ్లలో బీఆర్‌ఎస్‌దే విజయం

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్



జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్లలో మూడో సారి బీఆర్‌ఎస్ జెండా ఎగుర వేసేందుకు అందరూ కృషి చేయాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలానికి చెందిన పలు గ్రామాల నాయకులు కాసానిని తెలంగాణ భవన్‌లో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడారు. గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో మండల నాయకుడు అంజయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.




అనంతగిరి: వికారాబాద్ ఏజీ ఇమానియల్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

బంట్వారం: కోటిపల్లి చర్చిలో..

గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని ప్రార్థనాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వికారాబాద్, బంట్వారం తదితర ప్రాంత చర్చిల్లో క్రైస్తవులు.. ప్రపంచ శాంతిని ఆకాంక్షించిన ఏసుకు శిలువ వేసిన రోజును గుర్తు చేసుకుంటూ భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్లు దైవ సందేశం వినిపించారు.

- అనంతగిరి/ బంట్వారం



ప్రారంభానికి నోచుకోని సమీక్ష భవనం

కొత్త భవనమే.. కానీ పాతబడింది!

- 14ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని మీటింగ్ హాల్

బంట్వారం: రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మీటింగ్ హాల్.. ప్రారంభానికి నోచుకోక ముందే పాతబడిపోయింది. నిధుల లేమితో నిర్మాణంలో చిన్నచిన్న పనులు నిలిచిపోవడంతో.. మరోసారి మరిన్ని నిధులు కేటాయించారు. ఆ డబ్బులు ఖర్చు అయిపోయాయి కానీ.. భవనం మాత్రం అలాగే ఉండిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. బంట్వారం మండల కేంద్రంలో సుమారు 14 ఏళ్ల కిందట మీటింగ్ హాల్ నిర్మాణ పనులు చేపట్టారు. అప్పట్లో రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న పట్నం సునీతారెడ్డి, ఇందుకు అవసరమైన జెడ్పీ నిధులను మంజూరు చేశారు. నిర్మాణం పూర్తయినప్పటికీ.. చిన్నపాటి పనులు మిగిలి ఉండి, నిర్లక్ష్యానికి గురైంది. మిగతా పనుల పూర్తికి అదనంగా మరో రూ.5 లక్షలను ఆరేళ్ల కిందట సునీతారెడ్డి మంజూరు చేశారు. అయినప్పటికీ అసంపూర్తి పనులు అలాగే మిగిలి ఉన్నాయి. కారణం ఏదైనప్పటికీ.. నిధులు ఖర్చవుతున్నాయే కానీ.. మిద్దె మాత్రం వినియోగంలోకి రావటం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. ప్రభుత్వ భవనం అంటే అధికారులు చులకన భావంతో ఉన్నారని, ప్రజాధనం ఏమైతే మాకేందన్నట్టు వ్యవహరించడం వలనే బంగ్లా ఉపయోగంలోకి రాలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, భవనాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.